సాక్షి అనకాపల్లి

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



భూ సమస్యలపై ప్రదక్షిణలు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక మొక్కుబడిగా సాగుతోంది. క్షేత్ర స్థాయిలో పరిష్కారం లభించక మళ్లీ మళ్లీ అవే అర్జీలు వస్తున్నాయి. 8లో



ఏయూలో అమెరికన్ అధికారులు

విశాఖ విద్య: ఏయూను సోమవారం అమెరికన్ కాన్సులేట్ అధికారులు సందర్శించారు. రిజిస్ట్రార్ ధనుంజయరావుతో సమావేశమయ్యారు.



సిరులతల్లికి నీరాజనం

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో కనక మహాలక్ష్మి అమ్మవారిని ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

21న విస్తృత సేవా కార్యక్రమాలు

- జగనన్న పుట్టిన రోజు ఘనంగా జరపాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి: ఈనెల 21న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు సూచించారు. తారువలోని తన కార్యాలయంలో సోమవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. జగనన్న పుట్టిన రోజు సందర్భంగా జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలలో ఆస్పత్రులు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలలో పండ్లు, పాలు, రొట్టెలు, దుస్తుల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు.

22న రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు



మాట్లాడుతున్న సినీ నటుడు సుమన్

అనకాపల్లి: రాష్ట్ర స్థాయి నిజిషో స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ -2024 ట్రోఫీ పోటీలు ఈ నెల 22న స్థానిక గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు సినీ నటుడు సుమన్ తెలిపారు. సోమవారం స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి హాల్లో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కరాటేను అభ్యసించడం వల్ల మహిళలపై లైంగికదాడులను, దురాగతాలను చాలా వరకూ నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం చీఫ్ కోచ్ ఎస్.పి.ఎం.డి. నాయుడు, టి.డి.పి. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, క్రీడాకారులు కాండ్రేగుల శ్రీరామ్, శిలపరశెట్టి బాబి, కాండ్రేగుల యశ్వంత్, ఈశ్వరరావు, ఎస్.కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ బాక్సింగ్ టోర్నమెంట్‌కు మౌనిక



నర్సీపట్నం: ఈ నెల 18 నుంచి పంజాబ్‌లో జరగనున్న ఆల్ ఇండియా యూనివర్సిటీ నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్లో నర్సీపట్నానికి చెందిన బొంతు మౌనిక పాల్గొంటోంది. 80 కేజీల విభాగంలో ఆమె పోటీ పడనుంది. గత నెల ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో మౌనిక మంచి ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించి, నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌కు అర్హత సాధించినట్టు శాప్ కోచ్ కె.అబ్బు తెలిపారు.

● ఇదేం 'విజన్' బాబూ!



- అవ్వాతాతల కళ్లల్లో చీకట్లు
- వైఎస్సార్ కంటి వెలుగు పథకానికి కూటమి సర్కారు మంగళం
- విజన్ సెంటర్లు మూసివేత
- కొద్ది నెలలుగా నిలిచిపోయిన వైద్యసేవలు

ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేక మసక బారిన చూపుతోనే కాలం వెళ్లదీస్తున్న అవ్వాతాతలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని ప్రవేశ పెట్టింది. అవ్వాతాతలతో పాటు సరైన పోషకాహారం లేక, చిన్నతనంలోనే దృష్టి లోపాలతో బాధపడుతున్న పాఠశాల చిన్నారులకు సైతం ఈ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ఒక వరంగా నిలిచింది. అయితే చంద్రబాబు సర్కారు వచ్చాక వృద్ధులకు ఈ పథకానికి మంగళం పాడింది. కొద్ది నెలలుగా కంటి వైద్య సేవలు నిలిపివేసింది.విజన్ సెంటర్లు సైతం మూసివేసి అవ్వాతాతల కళ్లల్లో చీకట్లు నింపింది.

మసకబారిన కంటి వెలుగు

నక్కపల్లి :

నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమానికి 2019 అక్టోబరు10న శ్రీకారం చుట్టారు. మొదటి, రెండు విడతల్లో పాఠశాల విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లోనూ ఎంపిక చేసిన విజన్ సెంటర్లు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ఆప్తాలమిక్ ఉద్యోగులు అవ్వాతాతలకు కంటిపరీక్షలు నిర్వహించి దృష్టి లోపాలను గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేసేవారు. కళ్లద్దాలను ఉచితంగా అందించేవారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు సైతం ఉచితంగానే చేయించేవారు. ఇక విద్యార్థుల కోసం పాఠశాలలకు నేరుగా వైద్య సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు వచ్చి దృష్టి లోపాలతో బాధపడేవారిని గుర్తించి వైద్యసేవలు అందించేవారు. అయితే చంద్రబాబు సర్కారు ఈ పథకానికి మంగళం పాడింది. విద్యార్థులకు కంటిపరీక్షలు, కళ్లద్దాలు పంపిణీ, శస్త్రచికిత్సలు అనేది కేంద్రప్రభుత్వ పరిధిలోనిది కాబట్టి, జాతీయ అంధత్వ నివారణ సంస్థ ద్వారా కంటిపరీక్షలు చేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కానీ అవ్వాతాతలకు మాత్రం ఈ పథకం కింద సేవలు నిలిపివేశారు. దీంతో పండుటాకుల కళ్లలో చీకట్లు అలముకున్నాయి.

నాడు వృద్ధులకు వరంలా...

గత ప్రభుత్వ హయాంలో 2020 ఫిబ్రవరి 18 నుంచి ఫేజ్ 3 పథకం కింద 60 ఏళ్లు నిండిన అవ్వాతాతలపై దృష్టి సారించి విస్తృత రీతిలో కంటి వైద్య సేవలు అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కూడా కంటివైద్య శిబిరాలను నిర్వహించారు.

మూతపడ్డ విజన్ సెంటర్లు

గత ప్రభుత్వంలో ఆప్తాలమిక్ అసిస్టెంట్లు గ్రామాల్లో సచివాలయాల్లో అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసేవారు. ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో ఈ పథకం ద్వారా ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాల ద్వారా వైద్యపరీక్షలు చేసి ఆపరేషన్లు అవసరమైన వారికి ప్రభుత్వ ఖర్చుతోనే పెద్దాసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి ఇంటికి పంపించేవారు. ఇప్పుడా సేవలన్నీ నిలిచిపోయాయి. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌తో ఈ ఏడాది మార్చిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం రాకతో ఈ పథకం పూర్తిగా ఆగిపోయింది. దీనికి సంబంధించిన వెబ్‌సైట్‌ను సైతం మూసేసారు. అవ్వాతాతలకు స్క్రీనింగ్ పరీక్షల కోసం జిల్లాలో కె.కోటపాడు, యలమంచిలి, చోడవరం, నక్కపల్లి ఏరియా ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన విజన్ సెంటర్లను సైతం మూసివేశారు. కంటికి సంబంధించిన సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే పరీక్షలు, మందులు, కళ్లద్దాల కోసం కనీసం రూ.1500 ఖర్చవుతోంది. ఇక శస్త్రచికిత్సలు రూ.15వేల నుంచి రూ.20 వేలు ఖర్చవుతుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే భరించి వృద్ధులకు కంటి వైద్యం చేయించి మసక బారిన చూపు నుంచి కొత్తవెలుగులు ప్రసాదించేది.



అవ్వాతాతలకు కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు (ఫైల్)

జగనన్న ఆరోగ్య సురక్ష కింద కంటి శిబిరాల్లో వైద్య సేవలు పొందిన వృద్ధుల వివరాలు

గత ఏడాది సెప్టెంబరులో	ఈ ఏడాది జనవరిలో
వైద్య పరీక్షలు 39364	వైద్య పరీక్షలు : 13,259
కళ్లద్దాల పంపిణీ 23,211	కళ్లద్దాల పంపిణీ : 8,165
కాటరాక్ట్ ఆపరేషన్లు 1031	కాటరాక్ట్ ఆపరేషన్లు : 143

గత ప్రభుత్వంలో కంటి వెలుగు లబ్ధిదారుల సంఖ్య (వృద్ధులు)

గుర్తించిన అర్హులు	2,19,993
వైద్య పరీక్షలు	1,92,152
కళ్లద్దాల పంపిణీ	50,538
కాటరాక్ట్ సర్జరీలు	6747
ఉచితంగా మందుల పంపిణీ	1,34,867



శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారితో వైద్యాధికారులు (ఫైల్)

కూటమి ప్రభుత్వం ఈ సేవలు నిలిపివేయడంతో అవ్వాతాతల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

పథకానికి మార్పులు చేసే అవకాశం



అవ్వాతాతల కోసం గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వైఎస్సార్ కంటి వెలుగు పథకం ప్రస్తుతానికి నిలిపివేశారు. మార్పులు చేర్పులతో కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు సమాచారం. జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విజన్ సెంటర్లను కూడా మూసివేయడం జరిగింది. అయితే పాఠశాల విద్యార్థులకు మాత్రం ఈ వైద్యపరీక్షలు ,సేవలు యధావిధిగా కొనసాగిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అవ్వాతాతల కోసం కొత్త పథకాన్ని అమల్లోకి తెస్తే యథావిధిగా సేవలు అందుతాయి.

–డాక్టర్ రమణకుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ

తీర ప్రాంత రక్షణకు పటిష్ట చర్యలు

- ప్రతి బోటుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం
- కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం



జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాలో తీర ప్రాంత రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన తీర ప్రాంత రక్షణ పోలీసు జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. తీర ప్రాంతాలను సందర్శించే పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పండగలు, పర్వదినాలు సమయంలో సముద్ర స్నానాలు ఆచరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయ సమయాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించాలని, ముందుగా పండగల క్యాలెండర్‌ను తయారు చేసుకోవాలని ఆమె సూచించారు. మెరైన్ పోలీసు స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సముద్రంలో వేటకు వెళ్లే ప్రతి బోటుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరని చెప్పారు. తీరం మీదుగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పటిష్టమైన నిరంతర నిఘా ఉండాలన్నారు. పరిశ్రమల్లో కార్మికుల నియామకాలు చేపట్టేటప్పుడు భద్రత దృష్ట్యా ముందు జాగ్రత్తగా వారి గురించి పూర్తి సమాచారం సేకరించాలన్నారు. మెరైన్ అడిషనల్ ఎస్పీ జి.బి.ఆర్.మధుసూదనరావు మాట్లాడుతూ పూడిమడక మెరైన్ పోలీస్ స్టేషన్ ద్వారా పటిష్టమైన నిఘా కొనసాగుతుందన్నారు. తీరంలో పర్యాటకుల రద్దీని దృష్ట్యా గజ ఈతగాళ్లను నియమించాలని, వాచ్ టవర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్యకారులను గుర్తించడం కోసం బయోమెట్రిక్ కార్డులు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎం.దేవప్రసాద్, డీసీఐవో డి.శంకర్ ప్రసాద్, కస్టం సూపరిటెండెంట్ అతుల్ కుమార్ సింగ్, జిల్లా మత్స్యశాఖ అధికారి టి.వి.వి.ప్రసాద్, అదాని పోర్టు డిప్యూటీ మేనేజర్ బి.గోవిందవర్మ, సీఐఎస్ఎఫ్ తరఫున కె.ఎ.నతీష్, డిప్యూటీ కమాండర్ వి.కె.సాహు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ పేపర్ల ఆవిష్కరణ

- యూటీఎఫ్‌కు డీఈవో అభినందన



మోడల్ పేపర్ల నమూనాను ఆవిష్కరిస్తున్న డీఈవో గిడ్డి అప్పారావునాయుడు

అనకాపల్లి: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల కోసం యూటీఎఫ్ మోడల్ పేపర్లను రూపొందించడం అభినందనీయమని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాకలో జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో మోడల్ పేపర్ల కరపత్రాలను యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఎన్నో మార్కులు సాధించి లాభపడాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రమజ్యోతి, ఏఎస్‌వో వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా నాయకులు రొంగలి అక్కునాయుడు, మాకిరెడ్డి రాజనాయుడు, నాతవరపు సతీష్, దేవుడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెలగంట మోగింది



ఉపమాక గరుడాద్రిపై వెంకన్న సన్నిధిలో నెలగంట ప్రారంభ సూచకంగా ఘంటానాదం చేస్తున్న అర్చకులు

- ఉపమాక గరుడాద్రిపై ఘంటానాదం చేసిన అర్చకులు
- ఘనంగా ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు



గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6.57 గంటలకు ధనుర్లగ్నం ప్రవేశం ప్రారంభ సూచకంగా కొండపై కల్కిఅవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన స్వామివారి మూలవిరాట్‌కి దేవస్థానం ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ప్రత్యేక అభిషేకాలు, విశేష ప్రసాద నివేదనలు, నిత్యార్చనలు నిర్వహించారు. అనంతరం ఘంటానాదం (నెలగంట) చేయడంతో ధనుర్మాసోత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామివారి వద్ద తిరుప్పళ్లియెళ్లిచ్చై, తిరుప్పావై సేవాకాలము నిర్వహించిన తర్వాత నీరాజన మంత్రపుష్పం చెప్పారు. అనంతరం గోదాదేవి అమ్మవారి వ్రతదీక్షలో భాగంగా తిరుప్పావైలోని మొదటి పాశురంతో స్వామివారికి ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. గరుడ వాహనంపై శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామివారు, పెద్ద పల్లకిలో గోదాదేవి అమ్మవారు మాడ వీధుల్లో భక్తులకు తొలి దర్శనమిచ్చారు. ధనుర్మాస ఉత్సవంలో భాగంగా ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే ధనుర్మాసమంతా తిరుప్పావై పాశుర విశిష్టత పై ఉపమాక గ్రామానికి చెందిన వేద పండితురాలు, ప్రముఖ కవయిత్రి పండిట్ డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవితో ప్రవచన కార్యక్రమం ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకు ఏర్పాటు చేసినట్లు ప్రధానార్చకులు వరప్రసాద్ తెలిపారు. అలాగే గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు భగవద్గీత పారాయణ నిర్వహిస్తున్నట్లు ప్రధానార్చకులు తెలిపారు.

టన్నుకు రూ. 2 వేలు!

రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ పెద్దలు గద్దల్లా బొక్కేస్తుంటే.. నిఘా అధికారుల బృందం అదే బాటలో పయనిస్తోంది. అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ బృందం వసూళ్లకు పాల్పడి లోడింగ్‌కు అనుమతులిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టన్నుకు రూ.2 వేలు చొప్పున తీసుకొని అక్రమ రవాణాకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. కంటైనర్ టెర్మినల్‌లో ఉన్న అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యాపారి ఫ్రైట్ స్టేషన్ నుంచి నిత్యం జరుగుతున్న తంతే అయినా.. ఉన్నతాధికారులు మాత్రం తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.



విశాఖలోని కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు

నిఘా అధికారుల స్పెషల్ ట్యాక్స్

- పీడీఎస్ బియ్యం అక్రమార్కులతో చేతులు కలిపిన అధికారులు
- డబ్బులిస్తే లోడింగ్‌కి అనుమతులు
- ఆ వ్యాపారి కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌కి గుట్టుచప్పుడు కాకుండా తరలింపు

సాక్షి, విశాఖపట్నం : పేదల కోసం అందిస్తున్న పీడీఎస్ బియ్యం విదేశాలకు అక్రమంగా తరలించేస్తున్నారనీ.. వాటిని తాము పట్టుకున్నామంటూ కూటమి ప్రభుత్వం కలరింగ్ ఇస్తోంది. తూతూ మంత్రంగా దాడులు చేసి క్వింటాళ్లలో బియ్యాన్ని పట్టుకొని.. వందల టన్నుల గల బియ్యం గల కంటైనర్లను మాత్రం హాయిగా పంపించేస్తోంది. పైగా తామే ఈ వ్యవస్థని కాపాడుతున్నామంటూ ప్రభుత్వ పెద్దలంతా బాకాలు కొడుతున్నారు. ఇటీవల విశాఖపట్నంలో పర్యటించి.. 483 టన్నులు బియ్యాన్ని సీజ్ చేసినట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. కానీ.. పక్కనే ఉన్న తమ అనుయాయ వ్యాపారి వేర్ హౌస్‌లపై కన్నెత్తి చూడకుండా అటెన్షన్ మొత్తం.. పోర్టు అనుబంధ విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్(వీసీటీపీఎల్)కి చెందిన కంటైనర్ ఫ్రైట్ స్టేషన్(సీఎఫ్‌ఎస్)పై ఉండేటట్లుగా చేసేశారు. దీంతో సదరు సామాజికవర్గానికి చెందిన వ్యాపారి సీఎఫ్‌ఎస్‌ల నుంచి దర్జాగా పీడీఎస్ బియ్యం విదేశాలకు తరలిపోతున్నాయి.

నిఘా బృందమా..? వసూళ్ల బృందమా?

మంత్రి పర్యటన అనంతరం పోర్టు నుంచి పేదల బియ్యం వెళ్లకుండా నిఘా పటిష్టం చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం సీఎఫ్‌ఎస్‌లకు వచ్చే కార్గోని తనిఖీ చేసేందుకు అధికారులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. బియ్యం పట్టుకోవడం అటుంచితే.. సదరు బృందానికి మాత్రం లాభాలు తెచ్చిపెడుతోంది. 'పౌరసరఫరాల శాఖ అధికారుల బృందం నిరంతరం తనిఖీలు చేసి.. ఇక్కడికి వచ్చిన కార్గోలో పీడీఎస్ బియ్యం ఉంటే.. దాన్ని సీజ్ చేసి.. ప్రభుత్వానికి అప్పగించడంతో పాటు సదరు బియ్యాన్ని తీసుకొచ్చిన ఏజెన్సీపై 6ఏ కేసులు నమోదు చేయాలి.. బియ్యానికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్స్ ఇవ్వాలని గడువు విధించాలి'. కానీ.. ఇవేమీ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు టన్నుకు రూ.2 వేలు చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వచ్చిన లోడ్‌లో ఎంత మేర పీడీఎస్ బియ్యం ఉన్నాయో గణించి.. దాని ప్రకారం వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. బేరసారాలు కుదిరిన తరువాత ఆ రేషన్ బియ్యానికి రెక్కలొస్తున్నాయి.



కంటైనర్ లోడ్‌కు రూ.50 వేలు?

మొత్తంగా సీఎఫ్‌ఎస్ దగ్గరకి వస్తున్న రేషన్ బియ్యం నిఘా అధికారులకు పంట పండిస్తోంది. టీడీపీ సానుభూతిపరుడిగా వ్యవహరిస్తున్న సీఎఫ్‌ఎస్ యజమానికి చెందిన వేర్ హౌస్‌ల వైపుగా దారి మళ్లిస్తున్నారు. ఇలా వచ్చిన బియ్యాన్ని కంటైనర్లలో లోడ్ చేస్తున్నారు. ఒక్కో కంటైనర్‌కు రూ.50 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల చైనాకు వెళ్లిన కార్గో షిప్‌లో 60 కంటైనర్లు పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేశారు. ఈ షిప్ ద్వారా నిఘా అధికారులకు దాదాపు రూ.30 లక్షల వరకు ముట్టినట్లు తెలుస్తోంది. ఇలా.. ఓవైపు ప్రభుత్వం అండతో.. మరోవైపు.. నిఘా అధికారుల సహకారంతో పేదల బియ్యం.. ఓ వ్యాపారి కనుసన్నల్లో దేశాలు తరలిపోతుంటే.. ఉన్నతాధికారులు మాత్రం.. ఒక్క బియ్యం గింజ కూడా బయటకు వెళ్లడం లేదని చెబుతుండటం కొసమెరుపు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో అప్పన్నదొర సత్తా

- రన్నింగ్, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం కైవసం



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలను అందుకున్న అప్పన్నదొర

దేవరాపల్లి : మండలంలోని రైవాడ పంచాయతీ శివారు శంభువానిపాలెం గ్రామానికి చెందిన ఉగ్గిన అప్పన్నదొర(దొర బాబు) రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటారు. కృష్ణా జిల్లా గుడివాడ జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో 40 సంవత్సరాల పురుషుల విభాగంలో రన్నింగ్, లాంగ్ జంప్ క్రీడలలో ద్వితీయ స్థానంలో నిలిచారు. అప్పన్నదొర ఒక పక్క నేవీలో విధులు నిర్వర్తిస్తూ క్రీడల్లో నిత్యం సాధన చేస్తారు. ఈ క్రమంలోనే రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకున్నారు. గ్రామానికి చెందిన అప్పన్నదొర రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించడం పట్ల గ్రామస్తులు, మాజీ ఎంపీటీసీ ఉగ్గిన దేముళ్ల హర్షం వ్యక్తం చేశారు. అతనికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అమరజవాను కుటుంబానికి ఆర్థిక సాయం



పి.భీమవరంలో వరహాలు కుటుంబ సభ్యులకు రూ. లక్ష చెక్కు అందజేస్తున్న ఏపీ సైనిక వెల్ఫేర్ డైరెక్టర్ వెంకటరెడ్డి తదితరులు

బుచ్చెయ్యపేట : మండలంలో పి.భీమవరం గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి పడాల వరహాలు ఐదు మాసాల క్రితం విధి నిర్వహణలో అనారోగ్యంతో మృతి చెందారు. ఏపీ సైనిక వెల్ఫేర్ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకటరెడ్డి (విజయవాడ), జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి సత్యానందం సోమవారం గ్రామానికి వచ్చి వరహాలు కుటుంబాన్ని పరామర్శించారు. వరహాలు భార్య, ఆయన తల్లిదండ్రులకు సైనిక వెల్ఫేర్ ఫండ్ ద్వారా చెరో రూ.50 వేల చొప్పున రూ.లక్ష రూపాయల చెక్కును అందజేశారు. వరహాలు కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు. వీరి వెంట జిల్లా సైనిక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అగ్గాల హనుమంతురావు పాల్గొన్నారు.

భూ సమస్యలపై పదే పదే ప్రదక్షిణలు



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎం.జాహ్నవి



పట్టాలకు పాసుపుస్తకాలు మంజూరు చేయాలంటున్న మహిళా రైతులు

- మొక్కుబడిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- అర్జీలపై క్షేత్ర స్థాయి పరిష్కారం శూన్యం
- మళ్లీ మళ్లీ అవే దరఖాస్తులు
- చిత్తశుద్ధి కొరవడిన యంత్రాంగం

తుమ్మపాల : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం మొక్కుబడిగానే జరుగుతుంది. ప్రజల చేసుకున్న పలు సమస్యలకు క్షేత్రస్థాయిలో పరిష్కారం లేకుండానే అధికారులు ఎండార్స్‌మెంట్‌లతో సరిపెట్టేస్తున్నారు. దీంతో ప్రజల్లో ప్రభుత్వం, అధికారులపై నమ్మకం సన్నగిల్లడంతో పీజీఆర్ఎస్‌లో అర్జీల చేసుకునేందుకు కూడా వెనకాడుతున్నారు. అర్జీదారులపై సంబంధిత అధికారాలు ఎదురుదాడి చేస్తూ కక్ష పూరిత ధోరణితో వ్యవహరిస్తుండడంతో మరిన్ని చిక్కులు ఎదురవుతున్నాయి. కాళ్లరిగేలా పదేపదే అర్జీలు చేస్తున్నా సరే అధికారులు స్పందించడం లేదని, పీజీఆర్ఎస్ నిబంధనల ప్రకారం గతంలో అర్జీదారులతో తీసుకున్న ఫొటోలను అప్‌లోడ్ చేసి ఎండార్స్‌మెంట్‌తో సరిపెడుతున్నారని అర్జీదారులు వాపోతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 193 అర్జీలు నమోదయ్యాయి. వాటిలో అధిక సంఖ్యలో భూ సంబంధిత సమస్యలే 134 ఉన్నాయి. వాటిలో దాదాపు 40కి పైగా పునరావృత అర్జీలే కావడం గమనార్హం. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ సమస్యలే అధికంగా ఉండడం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా భావించవచ్చు.

అర్జీలపై రోజువారీ నివేదిక ఇవ్వాలి

కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటు జేసీ ఎం. జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై మూడు రోజుల్లో చర్యలు తీసుకోవాలని, అధికారులు వారి శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీల సత్వర పరిష్కారానికి సిబ్బందితో రోజువారీ సమీక్ష నిర్వహించాలన్నారు. అర్జీల పరిష్కారంపై శాఖల వారీగా రోజువారీ నివేదిక సమర్పించాలన్నారు.

పాసు పుస్తకాలు ఇవ్వడం లేదు...

గొలుగొండ మండలం కొత్తమల్లంపేట సర్వే నెం.991లో పలు సబ్ డివిజన్‌లో సాగుభూములకు ఇచ్చిన పట్టాలు, 1బీల ఆధారంగా రైతు భరోసా, బ్యాంకు రుణాలు మంజూరు కావడం లేదని, పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని మహిళా రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. ఏళ్లుగా జీడిమామిడి తోటలు సాగు చేసుకుంటున్న భూమిలో ఎనిమిది మంది రైతులను గుర్తించి గత ప్రభుత్వంలో పట్టాలు మంజూరు చేశారని, ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసి 1బీలు మంజూరు చేసినప్పటికీ పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక దోపిడీపై సమగ్ర విచారణ చేయాలి



డి.వెంకన్న

దేవరాపల్లి మండలంలో ఉచిత ఇసుక పేరుతో శారదా నదీ తీరంలో నిబంధనలు ఉల్లంఘించి అక్రమ ఇసుక వ్యాపారం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న పీజీఆర్ఎస్‌లో జేసీ జాహ్నవికి ఫిర్యాదు చేశారు. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు నెలవారీ లంచాలు చెల్లించే ఇసుక తవ్వి తరలిస్తున్నామంటూ అక్రమార్కులు బహిరంగంగా చెబుతున్నారని తెలిపారు. మండలంలోని మరెబ్బ, రాజుపురం, తిమిరాం, వేచలం, బోయిలకింతాడ గ్రామాల్లో శారదా నదిలో ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని అన్నారు. విచ్చలవిడి ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలకు తీవ్రమైన ప్రమాదం ఏర్పడుతుందని ఈ నెల 12న సీపీఎం ఆందోళన చేయడంతో తహసీల్దార్ స్పందించి ట్రాక్టర్లు పట్టుకోవాలని మారేపల్లి వీఆర్వోను ఆదేశించగా ట్రాక్టర్లను పట్టుకున్న వీఆర్ఏ, వీఆర్వోలపై డ్రైవర్లు తిరగబడినా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఇసుక దోపిడీదారులు, వారికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

వాహన బేరర్ల వేతనాల్లో కోత

- రూ.50లు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ
- టీటీడీ పాలకవర్గం నిర్ణయంపై ఆందోళన



ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావుకు వినతి పత్రం ఇస్తున్న వాహన బేరర్లు



స్వామివారి వాహనాలను మోస్తున్న బేరర్లు

నక్కపల్లి: వారంతా తరతరాలుగా స్వామివారి సేవల్లో పాల్గొంటున్నారు. రోజువారి కూలీలయినప్పటికీ స్వామి మీద భక్తితో పనులు మానుకుని ప్రత్యేక ఉత్సవాల్లో స్వామివారి వాహనాలను మోస్తూ జీవనం గడుపుతుంటారు. వీరి సేవలకు గుర్తింపుగా పూర్వకాలం నుంచి కొంత మొత్తాన్ని దినసరి వేతనాల రూపంలో చెల్లించేవారు. రూపాయి నుంచి ప్రారంభమైన ఈ దినసరి కూలీ గత ఏడాదికి రూ.250లకు చేరుకుంది. ఈ మొత్తంతోనే సంతృప్తి చెందుతూ స్వామివారి సేవల్లో భాగస్వాములవుతున్న వాహన బేరర్లకు టీటీడీలో కొలువుతీరిన కొత్త పాలకవర్గం షాక్ ఇచ్చింది. రూ.50 రూపాయలు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల బేరర్లంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 6వ శతాబ్దానికి చెందిన ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుపతి మాదిరిగానే పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారం ఉత్సవాలు, పూజాది కార్యక్రమాలు జరుగుతుంటాయి. పాల్గుణ మాసంలో కల్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, మార్గశిర మాసోత్సవాలు, శ్రావణమాసం, కార్తీక మాసం తదితర ప్రత్యేక పర్వదినాల్లో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, సేవలు నిర్వహిస్తుంటారు. ఈ ఆలయంలో పుణ్యకోటి, రాజాధిరాజ, ఆంజనేయ, హంస, ఇత్తడి గరుడ, సప్పర, పొన్న, పెద్దపల్లకి, గజవాహన సేవలు జరుగుతాయి. ఈ వాహనాలను మోసేందుకు 80 మంది బేరర్లు వారసత్వంగా పనిచేస్తున్నారు. వీరంతా మిగిలిన రోజుల్లో కూలి పనులకు వెళ్తూ స్వామివారి వాహన సేవలు ఉన్న రోజుల్లో వాహనాలు మోసేందుకే ఉండిపోతారు. సాధారణంగా కూలి పనులకు వెళ్తే రోజుకు రూ.1000 సంపాదిస్తారు. వాహన సేవలకు మాత్రం ఇప్పటి వరకు రూ.250లు మాత్రమే చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత వీరి వేతనాలు పెరుగుతాయని ఆశపడ్డారు. కానీ వీరి ఆశలు ఫలించకపోగా ప్రస్తుతం ఇచ్చే వేతనాల్లో కోత విధించారు. రూ.250ల నుంచి రూ.200లకు తగ్గిస్తూ టీటీడీ వారు తాజాగా ఉత్తర్వులు జారీ చేసారు. టీటీడీ నిర్ణయం పట్ల వాహన బేరర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రూ.10లు అయినా పెంచుతారని ఆశ పడ్డామని, తీరాచూస్తే రూ.50లు కోత విధించారని వాపోతున్నారు. తక్షణమే ఈ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని వారు కోరుతున్నారు. ఈ మేరకు వారు టీటీడీ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావుకు సోమవారం వినతి పత్రం ఇచ్చారు.

ఎస్పీ కార్యాలయానికి 35 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)35 ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. అర్జీలదారుల సమస్యలు తెలుసుకుంటూ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయన్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్‌రావు, ఎస్ఐ డి.వెంకన్న పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్‌లకు కలెక్టర్ అభినందనలు



సర్పంచ్‌లు వరహాలబాబు, అప్పారావులను అభినందిస్తున్న కలెక్టర్ విజయ్ కృష్ణన్, జేసీ జాహ్నవి, డీపీవో శిరీషరాణి

తుమ్మపాల: ప్రతిష్టాత్మక దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ శతత్ వికాస్ పురస్కారం పొందిన సర్పంచ్‌లను కలెక్టర్ విజయ కృష్ణన్ అభినందించారు. ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా నక్కపల్లి మండలం న్యాయంపూడి గ్రామ సర్పంచ్ రెడ్డి వరహాలబాబు, అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావులు అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. సమృద్ధి నీటి సరఫరా, పచ్చదనం పరిశుభ్రత విభాగాల్లో ఈ రెండు పంచాయతీలు బహుమతులు పొంది రూ.కోటి వంతున నగదు పురస్కారాలను సాధించాయి. ఇద్దరు సర్పంచ్‌లను కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. జాతీయ అవార్డులు తీసుకోవడం చాలా సంతోషకరమని, అందుకు కృషి చేసిన సిబ్బంది, సర్పంచ్‌లను అభినందిస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. జిల్లాకు మరిన్ని అవార్డులు సాధించాలని, ప్రతి పంచాయతీని ఉత్తమంగా తీర్చిదిద్దాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, డీపీవో ఆర్.శిరీషరాణి, డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ ఇ.నాగలక్ష్మి, ఈవోఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ప్రథమ్ అసర్ సర్వే



సర్వే నిర్వహిస్తున్న డైట్ విద్యార్థులు

యలమంచిలి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరీక్షించేందుకు ముంబైకి చెందిన ప్రథమ్ ఎడ్యుకేషన్ సంస్థ నిర్వహించిన అసర్ సర్వే సోమవారంతో ముగిసింది. ఉమ్మడి విశాఖ జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన 30 గ్రామాల్లో భీమునిపట్నం ప్రభుత్వ డైట్ విద్యార్థులు ఈ సర్వే చేపట్టారు. ఈ నెల 15, 16 తేదీల్లో శిక్షణ పొందిన డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులకు అంకగణితం, ఆంగ్లం, ప్రాంతీయ భాషల్లో అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి సర్వే ఫారాల్లో నమోదు చేశారు.

నేడు ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలతో మంగళవారం ప్రాంతీయ సదస్సు జరగనుంది. కలెక్టరేట్‌లో జరిగే ఈ సదస్సులో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌తోపాటు రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారు. పీజీఆర్ఎస్, ఫ్రీ హోల్డ్, నీటి పన్ను, ప్రభుత్వ భూముల సంరక్షణ, గృహ నిర్మాణ స్థలాలు, రీసర్వే, గ్రామ సభలో ప్రస్తావనకు వచ్చిన రెవెన్యూ అంశాలు, సర్వే రాళ్లపై పేర్ల తొలగింపు తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) ఆర్.పి.సిసోడియా, భూ పరిపాలన విభాగం చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి, భూ పరిపాలన విభాగం అదనపు చీఫ్ కమిషనర్ ఎస్.ప్రభాకర రెడ్డి తదితరులు హాజరవుతారు.

జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు



దేవరాపల్లి పీహెచ్‌సీలో తనిఖీలు చేపడుతున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు

దేవరాపల్లి : దేవరాపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రం-1లో జిల్లా ఆరోగ్య టాస్క్ ఫోర్స్ బృందం సోమవారం తనిఖీలు చేపట్టారు. డా. లూసీ(డీపీఎంవో), ఎ. రామచంద్రరావు(జిల్లా గణాంక అధికారి), జగదీష్ (డిస్ట్రిక్ ప్రోగ్రాం ఆఫీసర్), వై.జనార్దన్(డిస్ట్రిక్ డేటా మేనేజర్) తదితర నలుగురు సభ్యులతో కూడిన బృంద సభ్యులు సబ్‌సెంటర్ పరిధిలోని రికార్డులను స్థానిక పీహెచ్‌సీలో పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితి, గతంలో హెచ్‌బీ రిపోర్టులను, ప్రస్తుత హెచ్‌బీ రిపోర్టులను పరిశీలించారు. సకాలంలో టీకాలు, అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం పంపిణీ తదితర అంశాలతో పాటు కౌమార దశలోని 30 మంది విద్యార్థులకు సైతం హెచ్‌బీ(రక్త పరీక్షలు) పరీక్షలను పర్యవేక్షించారు. స్థానిక వైద్యాధికారులు ఈ.పూజ్య మేఘన, బి.రవితేజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు తనిఖీ చేపట్టి గుర్తించిన లోపాలపై నివేదిక అందజేస్తామని టాస్క్ ఫోర్స్ సభ్యులు తెలిపారు. జిల్లాలో ప్రతి నెలా 10 సచివాలయాల పరిధిలోని హెల్త్ క్లినిక్‌ల్లో తనిఖీలు చేపడుతున్నామన్నారు.

కారు అద్దం పగులగొట్టి బంగారం, నగదు చోరీ


అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారిలో పిసినికాడ గ్రామ డాబా వద్ద కారు అద్దం పగులగొట్టి 53 గ్రాముల బంగారం, రూ.40 వేలు, ఐఫోన్ గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారని పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు వివరాల మేరకు....విశాఖ జిల్లా పెందుర్తికి చెందిన సీహెచ్.హర్షకుమార్ ఈ నెల 14న స్నేహితులతో కలిసి కారులో లంబసింగి వెళ్లి తిరిగి వస్తూ ఆదివారం రాత్రి అనకాపల్లి జాతీయ రహదారి పిసినికాడ డాబా వద్ద ఆగారు. అక్కడ డాబాలో భోజనం చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కారు అద్దం పగులగొట్టి పై వస్తువులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

తాండవ డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులకు ఎన్నిక నేడు

- ఐదుగురు డీసీ మెంబర్లను ఎన్నుకోనున్న 27 నీటిసంఘాల అధ్యక్షులు
- నర్సీపట్నంలో మూడు స్థానాలకు, కోటనందూరులో రెండు స్థానాలకు ఎన్నికలు

నాతవరం: జిల్లాలో ఏకైక మేజర్ ప్రాజెక్టు తాండవ రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ డైరెక్టర్ల (డీసీ మెంబర్లు) ఎన్నికలను మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ప్రాజెక్టు డీఈ అనురాధ చెప్పారు. తాండవ రిజర్వాయర్ ఆయకట్టుకు సంబంధించి రెండు జిల్లాల పరిధిలో ఈనెల 14వ తేదీన నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. తాండవ ప్రాజెక్టు పరిధిలో 169మంది ప్రాదేశిక సభ్యులు, 27మంది నీటి సంఘాల అధ్యక్షులను ఎన్నుకున్నారు. 27మంది అధ్యక్షులు ఈనెల 17వ తేదీన డీసీ మెంబర్లను ఎన్నుకోవడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో నాతవరం-1, నాతవరం-2, కోటవురట్ల డీసీ మెంబర్లకు నర్సీపట్నంలో, కోటనందూరు, కె.ఇ.చిన్నయ్యపాలెం డీసీ మెంబర్లకు కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రాజెక్టు డీఈ తెలిపారు. తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ ఎన్నికలకు ఇంకా నోటిఫికేషన్ రాలేదన్నారు. ప్రస్తుతం డీసీ మెంబర్లకే ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు.

బావిలో పడి మతి స్థిమితం లేని మహిళ మృతి





భవానీ (ఫైల్)

బుచ్చెయ్యపేట : వడ్డాది యాదవ కాలనీకి చెందిన వివాహిత పినబోయిన భవానీ(35) అనుమానస్పదంగా మృతి చెందింది. గత రెండు రోజులుగా ఇంటి నుంచి వెళ్లిన ఆమె సోమవారం ఉదయం గ్రామ శివార్లలో గల పాండవ చెరువు వద్ద నేల బావిలో శవమై తేలింది. ఆమెకు మతి స్థిమితం లేకపోవడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోగా కుటుంబ సభ్యులు వెదికి తీసుకొచ్చారు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన భవానీ పొలంలోకి వెళ్తూ మంచినీళ్ల కోసం నేల బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో పడి ఉంటుందని ఆమె సోదరుడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భవానీకి భర్త, ముగ్గురు పిల్లలు వున్నారు. మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేసినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

లారీని ఢీకొట్టిన కారు

- కారు డ్రైవర్ మృతి, ఇద్దరికి గాయాలు





ప్రమాదంలో దెబ్బతిన్న కారు, మృతుడు సత్యమూర్తి (ఫైల్)

కశింకోట: తాళ్లపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. సీఐ ఎ. స్వామినాయుడు అందించిన వివరాల ప్రకారం... విజయవాడ నుంచి విజయనగరం వెళుతున్న కారు తాళ్లపాలెం వద్ద ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో చెన్నైకు చెందిన కారు డ్రైవర్ సత్యమూర్తి (44) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని అనకాపల్లి ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న ఇషాక్, హుస్సేన్‌లకు గాయాలయ్యాయి. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. వ్యాపార రీత్యా వారు విజయనగరం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

విశ్రాంత ఎక్సైజ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

- భారీగా నగదు, ఆభరణాలు అపహరణ
- వారం క్రితం బళ్లారిలో కుమార్తె వద్దకు వెళ్లిన కుటుంబం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్ టీం, పోలీసులు



రామ్మూర్తినగర్‌లో ఇంటి తాళం విరగ్గొట్టిన దుండగులు



గదిలో బీరువాలు తెరిచి చిందరవందర చేసిన దుస్తులు, వస్తువులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని రామ్మూర్తినగర్‌లో విశ్రాంత ఎక్సైజ్ ఉద్యోగి ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. కాలనీలో సొంతింట్లో మొదటి అంతస్తులో నివాసం ఉంటున్న బొడ్డేడ వెంకటరమణ భార్యతో కలిసి వారం రోజుల క్రితం బళ్లారిలో ఉన్న తమ కుమార్తె వద్దకు వెళ్లారు. గమనించిన గుర్తుతెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి ముందు, వెనక వైపు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. పడక గదిలో ఉన్న రెండు బీరువాల్లో సీక్రెట్ లాకర్లను తెరిచారు. పెద్ద సైజు బీరువాలో ఉన్న నగదు, బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో అద్దెకు ఉంటున్న కుటుంబం సోమవారం ఉదయం 7 గంటల సమయంలో మొదటి అంతస్తుకు వెళ్లే మెట్ల మార్గం ఇనుప గ్రిల్స్ తాళం విరగ్గొట్టి ఉండడంతో అనుమానం వచ్చి పైకి వెళ్లి చూడగా ఇంటి తాళాలు, తలుపు గడియలు విరగ్గొట్టి తలుపులు అన్నీ తెరిచి ఉన్నాయి. దీంతో ఇంటి యజమానికి సమాచారం అందించారు. నారాయణపురంలో యజమాని సోదరుడు బొడ్డేడ గోవిందరాజుకు ఈ విషయం చెప్పడంతో ఆయన ఇంటికి వచ్చి చూసి చోరీ జరిగినట్టు నిర్ధారించుకున్నారు. బీరువాల్లో దుస్తులు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉన్న విషయాన్ని, లోపలి అరలో నగదు, బంగారు ఆభరణాలు మాయమైన విషయాన్ని గుర్తించారు. మనుమరాలికి అవసరమైన వస్తువులు కొనడానికి తెచ్చిన రూ.4 లక్షలు నగదు, జత బంగారు చెవి రింగులు చోరీకి గురైనట్టు యజమాని సోదరుడు గోవిందరాజు తెలిపారు. చోరీ సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ సావిత్రి, అనకాపల్లి క్లూస్ టీం సభ్యులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితుల వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. తమకు ఇంకా లిఖిత పూర్వక ఫిర్యాదు అందలేదని, ఇంటి యజమాని ఇతర ప్రాంతంలో ఉన్నారని, మంగళవారం ఫిర్యాదు అందిన తర్వాత కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీకి యత్నం!



బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన వివరిస్తున్న బాధితురాలు వేగి విజయలక్ష్మి

యలమంచిలి రూరల్: పట్టణంలోని రామచంద్రమ్మ ఆలయానికి సమీపంలో గాజువాక బైపాస్ రహదారి పక్కన పాన్ షాపు నిర్వహిస్తున్న వేగి విజయలక్ష్మి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు యత్నించిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి సుమారు 8.20 గంటల సమయంలో దుకాణం వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చి లేస్ ప్యాకెట్ కావాలని అడుగుతూ మాటల్లో పెట్టి ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కునే ప్రయత్నం చేశారు. ఆమె పెనుగులాడుతూ పెద్దగా కేకలు వేయడంతో గొలుసుతో పాటు మహిళను కొంతదూరం లాక్కెళ్లిపోయారు. దీంతో బంగారు గొలుసు తెగిపోయి సగానికిపైగా ముక్కను దొంగలు చేజిక్కించుకుని ద్విచక్ర వాహనంపై అక్కడ్నుంచి పరారయ్యారు. నిందితులు తలకు మంకీ టోపీ ధరించి ఉన్నారని, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం గమనించి చోరీకి పాల్పడ్డారని, దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితురాలు తెలిపారు. చైన్ స్నాచింగ్‌పై ఎలాంటి కేసు నమోదు చేయలేదని పట్టణ ఎస్సై సావిత్రి తెలిపారు.

మనస్థాపంతో గిరిజన యువతి ఆత్మహత్య



మృతి చెందిన సంతి

మాకవరపాలెం : కోళ్లఫారంలో పనిచేస్తున్న ఓ గిరిజన యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరిసీతారామరాజు జిల్లా పాడేరు మండలం బడిమెల గ్రామానికి చెందిన కొల్లూరి సంతి(19) పెదబయలు మండలం లందూరు గ్రామానికి చెందిన కొర్రా చరణ్‌ను ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. పెద్దలకు తెలియకుండా వివాహం చేసుకున్న వీరిద్దరూ లందూరులో నివాసం ఉంటూ 40 రోజుల క్రితం మండలంలోని జంగాపల్లిలోని సూర్యనారాయణ కోళ్లఫారంలో పనికి చేరారు. అయితే సోమవారం కోళ్లకు మేత వేసే విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సంతి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా చరణ్‌కు గతంలో మరో వివాహం జరగ్గా వివాదాల కారణంగా రెండేళ్ల క్రితం విడిపోయారు. ఆత్మహత్య ఘటనపై అందిన సమాచారం మేరకు ఎస్ఐ దామోదర్‌నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: స్థానిక విద్యుత్‌శాఖ డి–1 సెక్షన్ పరిధిలో తీగల మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు, విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ పి.త్రినాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి–1 సెక్షన్ పరిధిలో రైల్వే స్టేషన్ రహదారి, తాకాశివీధి, రింగ్‌రోడ్డు, లక్ష్మీనారాయణనగర్, నెయ్యిలవీధి, పిలావారి వీధి, చిన్నవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, స్థానికులు సహకరించాలని కోరారు.

శివాలయంలో రుద్రాభిషేకం



శివాలయంలో రుద్రాభిషేకం చేస్తున్న అర్చకుడు

కశింకోట: స్థానిక శివాలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని రుద్రాభిషేకం సోమవారం సాయంత్రం నిర్వహించారు. వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలు, పంచామృతాలు వగైరాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు ఎక్కువగా హాజరయ్యారు. మధ్యాహ్నం పేదలకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ప్రకృతి సాగులో ఆశాజనకంగా వరి దిగుబడి



పంట కోత ప్రయోగం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కశింకోట: మండలంలోని సుందరయ్యపేటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరి పంట కోత ప్రయోగాన్ని సోమవారం నిర్వహించారు. రైతు కచ్చాల రాజబాబుకు చెందిన ఎకరా భూమిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి పంట పండించింది. దీంతో ఐదు మీటర్ల పొడవు, వెడల్పులో వరి పంటను కోసి ధ్యానం సేకరించి తూకం వేయగా సుమారు 18.20 కేజీలు దిగుబడి వచ్చింది. ఇది ఆశాజనకంగా ఉందని ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ తెలిపారు. ఎల్1 గంటా అప్పారావు, ఎల్2 వేణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 5,640 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	5,140
మొదటి రకం	3,440	4.380
రెండో రకం	3,150	3,800
మూడో రకం	3,000	3,150

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
సన్ని	: పర్తిసాయి
మిస్‌యూ	: షిర్డీసాయి
జీబ్రా	: వెంకటేశ్వర
ప్రణయ గోదావరి	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–11 యూనిట్లు, బీ పాజిటివ్–10 యూనిట్లు, ఓ పాజిటివ్–20 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 232 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 196 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

వలంటీర్లకు పంగనామం

- రూ.10 వేలు పెంచుతామని బూటకపు హామీ
- అధికారంలోకి రాగానే వారిని దూరం పెట్టిన చంద్రబాబు
- 6 నెలలుగా విడుదల కాని గౌరవ వేతనం



భీమునిగుమ్మంలో వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్(ఫైల్)

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో దగాకోరు హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబునాయుడు ఏరుదాటాక తెప్ప తగలేసినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు వలంటీర్లను తొలగించబోమని, వారి సేవలను కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలు ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు గడుస్తున్నప్పటికి ఒక్క వలంటీర్‌ను విధుల్లోకి తీసుకున్న పాపాన పోలేదు.

గత వైఎస్సార్‌సీపీ పాలనలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 2.66 లక్షల మంది వలంటీర్లను ఏర్పాటు చేయగా, అనకాపల్లి పట్టణ, మండలంలో 463 మంది విధు ల నిర్వహిస్తూ వారి కుటుంబాన్ని పోషించుకునేవారు. రూ.5 వేల గౌరవ వేతనం తీసుకుని అనేక రకాల సంక్షేమ పథకాలను అర్హులైన పేద లబ్ధిదారులకు చేరవేసేవారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా వంటి మహమ్మారి విలయ తాండవం చేస్తున్న సమయంలో పట్టణ, మండలంలో ప్రజలు దాని బారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వ్యాధిబారిన పడిన వారిని సకాలంలో గుర్తించి, రోగికి ప్రాణహాని జరగకుండా ఇంటింటికి సకాలంలో మందులు పంపిణీ చేసి ప్రజల మన్ననలను పొందారు.

దగాకోరు మాటలతో...

అటువంటి వలంటీర్లకు నెలకు రూ.5 వేలు ఏమి సరిపోతుందని సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి అధికారంలోకి వస్తే నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం అందిస్తామని చంద్రబాబునాయుడు కల్లబొల్లి కబుర్లు చెప్పారు. ఆనక వలంటీర్ల ఓట్లతో గెలిచిన విషయాన్ని మరచి ఆరుమాసాలుగా వారి సేవలను వినియోగించుకోకుండా పక్కన పెట్టేశారు. వలంటీర్లు రాష్ట్రంలో అద్భుతంగా పనిచేస్తున్నారని, ఎన్నికల సమయంలో సాక్షాత్తు ప్రధాని మోదీ ప్రశంసించారని గుర్తు చేశారు. అటువంటి వలంటీర్లను పక్కన పెట్టడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసెంబ్లీ సాక్షిగా కూటమి పాలకులే వలంటీర్ వ్యవస్థే లేదు కదా అంటూ మాట్లాడడంతో చంద్రబాబుపై పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. అనకాపల్లి పట్టణం, మండలంలో 53 సచివాలయాల్లో 463 మంది వలంటీర్లు వైఎస్సార్‌సీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను సకాలంలో అందజేస్తూ ప్రజల మన్ననలను పొందారు.



కోట్ని వీధిలో వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

ఆరు మాసాలుగా ఊసే లేదు

ఆరు మాసాలుగా కూటమి ప్రభుత్వం చేసిన అద్భుతం వలంటీర్లను తొలగించడమేనా..? గౌరవ వేతనాన్ని నిలిపివేయడంతో సంపద సృష్టించారు. ఈ సందపను ఎవరి కోసం ఖర్చు చేశారో అర్థం కావడం లేదు. వలంటీర్‌గా పని చేస్తూ చిన్న కుటుంబాలను పోషించుకునేవారు.

– ఎం.కిరణ్‌కుమార్, గాంధీనగరం, అనకాపల్లి

వలంటీర్ లేకుండా గౌరవవేతనమా?

వలంటీర్ వ్యవస్థ లేకుండానే గౌరవ వేతనం రూ.10 వేలు అందిస్తామని ఎలా హామీ ఇచ్చారో అర్థం కావడంలేదు. ఎన్నికల సమయంలో మూడు మాసాల బకాయిపడిన జీతాలు నేటికీ చెల్లించలేదు. మాలాంటి వలంటీరు బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

– వరలక్ష్మి, వేల్పులవీధి, అనకాపల్లి

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

కోవిడ్ సమయంలో చేసిన సేవలు నేటికీ ప్రజలు మర్చిపోలేకపోతున్నారు. గతంలో సంక్షేమ పథకాలు సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధి దారుల గృహాలకు ఇచ్చేవాళ్లం. నేటి పాలనలో వలంటీర్ ఉద్యోగం ఊడిపోయింది. చంద్రబాబు ఉద్యోగాలు కల్పించాలి. వలంటీర్లు వ్యవస్థలో ఎక్కువగా మహిళలే పనిచేశారు.

– పి. అనురాధ, అక్కిరెడ్డిపాలెం, అనకాపల్లి మండలం

పారిశుధ్య లోపంపై ఆందోళన



భీమునిగుమ్మంలో ధర్నా చేస్తున్న మహిళలు, కొణతాల హరనాథ్‌బాబు

అనకాపల్లి: పట్టణం పరిధిలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక భీమునిగుమ్మంలో అధ్వాన పారిశుధ్యంపై స్థానిక ప్రజలతో కలిసి సోమవారం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నేటికి ఆరు మాసాలు అవుతున్నప్పటికీ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. భీమునిగుమ్మంలో నెలరోజులుగా పారిశుధ్య కార్మికులు డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరచకపోవడంతో దోమల సంచారం ఎక్కువైందన్నారు. దోమకాటుకు గురై వ్యాధుల బారిన పడి పలువురు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నట్లు ఆయన చెప్పారు. జోనల్ పరిధిలో దోమల మందు పిచికారి చేసే సిబ్బంది లేకపోవడం దారుణమన్నారు.

రిక్షా కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి



రిక్షా కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న మాణిక్యాలరావు

అనకాపల్లి: నేటి ఆధునిక సమాజంలో తమ రక్తాన్ని చెమటనే ఇంధనంగా చేసుకుని రిక్షా తొక్కుతున్న కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలని జిల్లా రిక్షా కార్మికుల సంక్షేమ సంఘం కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు కోరారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రిక్షా కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రిక్షా కార్మికుల సంఘాలన్నీ ఒక సంఘంగా ఏర్పడి వారి సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రిక్షా కార్మికులు జీవన శైలిలో మార్పులు చేసుకోవాలని కోరారు. అనంతరం వారికి గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గురుంపల్లి వెంకటరావు, కార్యదర్శి నీలకంఠం, కోశాధికారి నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు దశపర్ణి కషాయం



దశపర్ణి కషాయం తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

కశింకోట: అన్ని పంటలకు క్రిములు, తెగుళ్లను నివారించడానికి దశపర్ణి కషాయం ఉపకరిస్తుందని మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ తెలిపారు. మండలంలోని లాలంకొత్తూరులో సోమవారం ప్రకృతి వ్యవసాయంలో పంటలకు వచ్చే క్రిములు, తెగుళ్ల నివారణకు ఉపకరించే దశపర్ణి కషాయం తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కషాయం వాడటం వల్ల అన్ని రకాల పంటలపై క్రిములు, తెగుళ్ల నివారణ జరుగుతుందన్నారు. కషాయం తయారు కావడానికి 45 రోజులు సమయం పడుతుందన్నారు. దీన్ని పంటలపై నీరు కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లేడు, వావిలి, వేప తదితర పది రకాల ఆకులు, పసుపు, ఆవు మూత్రం, శొంఠి, ఆవు పేడ తదితర వాటిని వేసి రెండు డ్రమ్ముల్లో తయారీకి సిద్ధం చేశారు. 400 లీటర్ల కషాయాన్ని తయారు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎల్1 గంటా అప్పారావు, ఎల్2 వేణమ్మ, ఐసీఆర్‌పీలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామదేవతల ఉత్సవాలకు ప్రత్యేక చర్యలు



మోదకొండమ్మ అమ్మవారు



అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కోరుకొండ రాఘవ

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామదేవతలు ఉత్సవాలను నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ కోరారు. స్థానిక గాంధీబొమ్మ జంక్షన్‌లో మోదకొండమ్మ జాతర పురస్కరించుకుని సోమవారం మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ పట్టణ, గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలను నిర్వహించే సమయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ నిర్వాహకులు మొగ్గ శ్రీను, కోరుకొండ అప్పలసూరి, కరెడ్ల రాజేష్, కరణం శ్రీనివాసరావు, పాలిమేర భరణి, కేతిరెడ్డి ప్రసాద్, గేదెల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బంది జీతాలు తక్షణం చెల్లించాలి



ఎంఈవోలకు వినతి పత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మిక యూనియన్ ప్రతినిధులు



డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

అనకాపల్లి/ కశింకోట: ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్(ఆయా) వర్కర్లకు బకాయిపడ్డ 5 నెలల జీతాలను తక్షణమే విడుదల చేయాలని ఏపీ ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రతినిధి గంటా శ్రీరామ్, పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక డీఈవో కార్యాలయం వద్ద, కశింకోటలోని ఎంఈవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్ల జీతాలు ప్రభుత్వం 5 మాసాలుగా ఇవ్వడం లేదన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 2న ప్రభుత్వం జీవో నంబర్.413 ప్రకారం పాఠశాలల విద్య బడ్జెట్ అంచనాలు 2024–2026కి ఆయాలు, నైట్ వాచ్‌మన్ వేతనాల కోసం రూ. 6,438.40 లక్షలు, టాయిలెట్ల క్లీనింగ్ చేసిన సిబ్బందికి రూ.2,352.03 లక్షలు విడుదల చేసినట్టు జీవోలు ఇచ్చి నేటికీ జీతాలు చెల్లించలేదన్నారు. కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్లకు ప్రతి నెల 5వ తేదీలోగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కశింకోట ఎంఈవోలు సురేష్‌కుమార్, మూర్తిలకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికులు యర్రంశెట్టి లక్ష్మి, రూపావతి, హారిక, నూకరత్నం, తులసి, ఎర్రమ్మ, అమ్ములు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ



అనాథ చిన్నారుకు నిత్యావసర సరకులు పంపిణీ చేసిన సోషల్ సర్వీస్ గ్రూప్ ప్రతినిధులు

అనకాపల్లి: అనాథ పిల్లలకు దాతలు సహాయం చేయడం వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అనకాపల్లి సోషల్ సర్వీస్ గ్రూప్ ప్రతినిధి కె.వి.గౌరీపతి తెలిపారు. మండలంలో సుందరయ్యపేట దయా చిల్డ్రన్ హోమ్ అనాథ పిల్లలకు రూ.14 వేలు విలువ చేసే నిత్యావసర సరకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూపు ఆధ్వర్యంలో ప్రతి నెలా జిల్లాలో ఏదో ఒక అనాథ ఆశ్రమంలో పిల్లలకు తమ శక్తికొద్దీ సహాయం చేస్తున్నామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు తమవంతు సహాయం అందించాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగి విజయకుమార్ ఇక్కడ ఎకరాన్నర స్థలాన్ని కొనుగోలు చేసి అనాథ పిల్లలకు వసతి కల్పించి వారి చదువులకు సహాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు డాక్టర్ ఎం.బి.వి.స్వామి, ఎం.చంద్రశేఖర్, కె.జగన్నాథరావు, దొడ్డి బాబు, సి.ఎస్.ఆర్.శేషగిరిరావు, ఆళ్ల అప్పారావు, పగడాల వీరభద్రరావు పాల్గొన్నారు.

22న గవర కులస్తుల వన సమారాధన



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న భూలోకనాయుడు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ఆవరణలో ఈ నెల 22న గవర కులస్తుల కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు గవర సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు బుద్ధ భూలోకనాయుడు, సూరిశెట్టి నర్సింగరావు తెలిపారు. సోమవారం స్థానిక గవరపాలెం సత్తెమ్మతల్లి ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని గవర కులస్తులు ఇంటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. ముందుగా గవర కులస్తుల వైద్యులు ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. సంఘం నాయకులు మళ్ల జగన్‌మోహన రావు, పిల్లా త్రినాథ్, దాడి జోగేంద్రనాయుడు, పొలమరశెట్టి వాణి, దొడ్డి పార్వతిదేవి, కాండ్రేగుల కనక మహాలక్ష్మి, బొడ్డేడ అరుణ్‌కుమారి పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు



మహాసభ గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి : మూతపడిన మూడు సహకార చక్కెర కర్మాగారాలను ఆధునికీకరిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం తక్షణమే ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఈనెల 21, 22 తేదీల్లో జరిగే సీపీఎం 24వ జిల్లా మహాసభల గోడ పత్రికలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నర్సీపట్నం అబిద్ సెంటర్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం మహాసభలు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. స్వర్ణ ఆంధ్రప్రదేశ్ విజన్ 2047లో పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలు తప్ప ప్రజల అభివృద్ధి కనిపించలేదని, ప్రజలు మౌలిక సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వాలు విఫలమౌవుతున్నాయని అన్నారు. చక్కెర కార్మాగారాలను ప్రభుత్వం ఆధునికీకరించి, బెల్లం, చెరకు రైతులను ఆదుకోవాలని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు శంకుస్థాపన తప్ప ఆ ప్రాజెక్టు పూర్తికి ఏ ప్రభుత్వమూ సరిపడా నిధులు కేటాయించడంలేదన్నారు. సీపీఎం జిల్లా నాయకులు బి.ప్రభావతి, జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, డి.వెంకన్న, గంటా శ్రీరామ్ పాల్గొన్నారు.

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పూలదండలతో అలంకరణ



వేణుగోపాల స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

కశింకోట: ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో లక్ష్మీదేవి విగ్రహాన్ని, స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను పూలతో అలంకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి విష్ణు సహస్ర నామార్చన చేశారు. తిరుప్పావై పారాయణం చేశారు. అనంతరం ధనుర్మాసం ప్రారంభిస్తూ నెల గంట పెట్టారు.

మత్స్యావతారంలో..

కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూల విరాట్‌ను మత్స్యావతారంలో చూడ ముచ్చటగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో అర్చకుడు అత్తిలి కోదండ పాణి ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు ప్రారంభించారు. గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని అలంకరించి పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న పడమటమ్మ వారి మేడ



అరటి గెలలు, వ్యవసాయ ఉత్పత్తులు, పూలమాలలతో కట్టిన పడమటమ్మ వారి మేడ

కశింకోట: స్థానిక కస్పావీధి రామాలయం వద్ద వందలాది అరటి గెలలు, వ్యవసాయ ఉత్పత్తులతో సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో 'పడమటమ్మ మేడ' పేరిట ఏర్పాటు చేశారు. ఇది ఆహూతులను విశేషంగా ఆకట్టుకొంది. రెండేళ్లకొకమారు ఇక్కడ నిర్వహించే పడమటమ్మ ఉత్సవం మంగళవారం జరగనుంది. ఉత్సవం ముందు రోజు స్థానిక రైతులు, భక్తులు అరటి గెలలు, వరి వెన్నులు, బెల్లం వగైరా తెచ్చి రామాలయం ముందు పెద్ద షెల్టర్‌కు ఆకర్షణీయంగా కట్టి అమ్మవారికి నివేదిస్తారు. దీనివల్ల అమ్మవారి దయతో తమ కుటుంబాలకు శుభం జరుగుతుందని, పంటలు సమృద్ధిగా పండుతాయని విశ్వసిస్తారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. వీటిని మంగళవారం వరకు ఉంచి ఉత్తమమైన ఉత్పత్తుల రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు



సారె ఊరేగింపుతో ఆలయం నుంచి బయలు దేరుతున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులో కుంచావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవం పురస్కరించుకుని సోమవారం పట్టణ పురవీధుల్లో అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటకాలను మహిళలు తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు పంచిపెట్టారు. అమ్మవారి ఉత్సవాన్ని ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ఆలయం చైర్మన్ ఎం.వీరభద్రరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి ఆలయంలో చోరీ

అనకాపల్లి: మండలంలో సత్యనారాయణస్వామి కొండపై ఆలయంలో ఆదివారం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తొలుత ఆలయం తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా రాకపోవడంతో సీసీ కెమెరాలను దొంగిలించినట్లు పట్టణ పోలీసులకు ఆలయ ఈవో శ్రీరామ్మూర్తి సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి.వి.విజయకుమార్ తెలిపారు.

హెల్మెట్ ధరించాలని బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని జెండా ఊపిప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ నుంచి బైక్ ర్యాలీని ఆమె సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణ పురవీధుల్లో హెల్మెట్ ధరించి వాహనదారులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని వాపోయారు. హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, పట్టణ సీఐ టి.వి.విజయ్‌కుమార్, రూరల్ సీఐ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు రేబాక పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 18న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి ఎస్.గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే నిరుద్యోగులు ముందుగా naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 26 సంవత్సరాలు కలిగి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ అర్హత కలిగిన నిరుద్యోగులకు రెండు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. వివరాలకు 8143229228 సంప్రదించాలని సూచించారు.